# ప్రణవ పద్మాకరం

## నవంబర్ -2025







# నవంబర్ , 2025

## నవంబర్ , 2025 విషయ సూచిక

సంపుటి-4
సంచిక-11


01 సంపాదకీయం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం — శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం — శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం — మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్


09 గురుదేవుల జీవన కవనము — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం


శ్రీ మహాగణాధిపతయే నమః | శ్రీ గురుభ్యోనమః | శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

# సంపాదకీయం

## గురువాక్యం తు కర్తవ్యమ్

భగవంతుడు కూడా భూమి మీద అవతరించాక, గురువును ఆశ్రయించి మాత్రమే గొప్పవాడు కావాలని శ్రీకృష్ణుడు సందేశమిచ్చాడు. పరమాత్మసందేశాన్ని తప్పక పాటించినవారు ఇహపరాలు పొందుతారు. నవంబరు ఒకటవ తేదీ కార్తిక శుక్ల ఏకాదశి. దీనిని 'ప్రబోధిని' అని పిలుస్తారు. తమ శక్తిననుసరించి ఉపాసముండి ద్రాక్షపండ్లు, చెఱకు ముక్కలు, దానిమ్మ, అరటిపండ్లు మొదలగునవి నివేదన చేసి విప్రులకు, గురువులకు దానధర్మాలు చేసుకొనేవారు, శివకేశవులను అర్చించేవారు పరమ సుఖాలు పొందుతారు. ఇక కార్తిక దీపాలు వెలిగించేవారు ఈ జన్మలోనే విముక్తి పొందుతారు. కార్తిక శుక్ల ద్వాదశి 'ఉత్థాన ద్వాదశి' లేక 'క్షీరాబ్ధి ద్వాదశి' అని పిలవబడుతుంది. ఈ రోజు శ్రీమహావిష్ణువు క్షీర సముద్రంలో నిదురను విడిచి పెడతాడు . ఈ పూట హరినామ సంకీర్తనము, దర్శనము, దానము అత్యంత శుభఫలితాన్నిస్తాయి. నవంబర్ 5వ తేదీ కార్తీక పూర్ణిమ నాడు ఏలూరు, శ్రీ ప్రణవ పీఠంలో లక్షపత్రి పూజ మరియు సాయంత్రము జ్వాలాతోరణ కార్యక్రమం ఉంటాయి. జ్వాలాతోరణం దూరినవారికి వచ్చే శుభఫలితాలను గురించి ప్రణవపీఠం ముద్రించిన 'కార్తిక పురాణం' చదివి తెలుసుకోండి. నవంబరు 8 వ తేదీ సంకష్ట హర చతుర్థి. 15 వ తేదీ కార్తిక కృష్ణ ఏకాదశి (దీనిని రమా ఏకాదశి అంటారు), 18 వ తేదీ మాస శివరాత్రి, 20 వ తేదీ కార్తిక అమావాస్యతో కార్తిక కార్యక్రమాలు పూర్తి అవుతాయి. 21 వ తేదీ పోలి స్వర్గ కార్యక్రమం ఉంటుంది. నవంబరు 21 వ తేదీ నుండి మార్గశీర్ష మాసం ఆరంభమవుతుంది. మాసానాం మార్గశీర్షోఽహం అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు అన్నాడు. కనుక ఈ మాసాన్ని సద్వినియోగం చేసుకుందాం. నవంబరు 26 వ తేదీ సుబ్రహ్మణ్య షష్ఠి. ఆ రోజు సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించి సకల దోష విముక్తిని పొంది, సకల సుఖాలను పొందండి. డిసెంబరు 1 వ తేదీ 'గీతా జయంతి' ని భక్తి శ్రద్ధలతో జరుపుకుందాం. భగవద్గీతా పఠనము, సారాంశం గ్రహించి ప్రవర్తించడం రెండూ మన కర్తవ్యాలు. నవంబరు 28 వ తేదీ కాలభైరవాష్టమి. కాలభైరవానుగ్రహం లేనిదే కాశీ నివాస యోగం ఉండదు. అపమృత్యుబాధలనుండి బయట పడడానికి, ముక్తికి, నరక విముక్తికి కాలభైరవునకు గారెలు నివేదించి పూజించి తరించండి. Brahmasri Vaddiparti Padmakar Official channel లో కాలభైరవాష్టకం నేను గానం చేసి ఉంచాను. అది ఈ రోజు వినండి. ఇక అత్యంత ముఖ్యమైన విషయము ప్రణవపీఠ ప్రవచన మంటపము మరియు శ్రీ లక్ష్మీసమేత సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. శరవేగంగా సాగుతున్నాయి. అత్యంత వ్యయంతో కూడిన ఈ కార్యక్రమంలో గురుభక్తులందరూ భాగస్వాములు కావాలని తెలియజేస్తున్నాము. ప్రతి మాసం గాని, వారానికి ఒకసారి గానినిర్మాణానికి యథాశక్తి ధనాన్ని పంపి హరిహరవిరించి గురు కటాక్షం పొందండి.

అనేక మంగళాశాసనములతో.........

వద్దిపర్తి పద్మాకర్



# శ్రీ గణేశ పురాణం

శ్లోII దీనార్థ వాచకో హేశ్చ రంబః పాలకవాచకః
పాలకం దీనలోకానాం హేరంబం ప్రణమామ్యహమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౮౯)

"హే" అను అక్షరానికి దీనుడు అని అర్థం. రంబ అనగా పాలించువాడు. దీన జనులను పాలించి, కాపాడువాడు కనుక గణపతిని హేరంబుడన్నారు.

శ్లోII విపత్తి వాచకో విఘ్నో నాయకః ఖండనార్థకః
విపత్ ఖండన కారం తం ప్రణమే విఘ్ననాయకమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯౦)

విఘ్న శబ్దానికి ఆపద, కష్టం, ఆటంకం అనే అర్థాలున్నాయి. నాయకుడనగా ఖండించేవాడు. ఆపదలను ఖండిస్తాడు కనుక ఆయనను విఘ్ననాయకుడన్నారు. ఆయనకు నమస్కారం.

శ్లోII విష్ణు దత్తైశ్చ నైవేద్యైః యస్య లంబం పురోదరమ్
పిత్రా దత్తైశ్చ వివిధైః వందే లంబోదరం చ తమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯౧)

విష్ణువు, తన తండ్రియైన శివుడు సమర్పించిన నైవేద్యములు స్వీకరించి (వరాలను స్వీకరించి) పెద్ద పొట్టతో కనబడడం వల్ల వినాయకుని లంబోదరుడన్నారు. ఆయనకు నమస్కారం.

శ్లోII శూర్పాకారౌ చ యత్కర్ణౌ విఘ్నవారణకారకౌ,
సంపద్దౌ జ్ఞానరూపే చ శూర్పకర్ణం నమామ్యహమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯౨)


గణపతి చెవులు పెద్దపెద్ద చాటలవలె ఉంటాయి. ఆ చెవులతో విఘ్నాలను ఎగరగొడతాడు. ఆ చెవులు సంపదలను ఇస్తాయి. జ్ఞానస్వరూపాలు కూడా. విఘ్న నివారణ చేసే, సంపత్ప్రదాలైన జ్ఞాన స్వరూపాలైన చెవులను కలిగి ఉండడం వల్ల ఆయనను శూర్పకర్ణుడు అన్నారు. ఆయనకు నమస్కారం.

శ్లోII విష్ణుప్రసాదం మునినా దత్తం యన్మూర్ధ్ని పుష్పకమ్
తద్గజేంద్ర ముఖం కాంతం, గజవక్త్రం నమామ్యహమ్ II

(బ్ర.వై.పు.అ.44.శ్లో.౯౩)

దుర్వాస మహర్షి విష్ణుని ప్రసాదమైన పూవును ఒకప్పుడు ఇంద్రునకు ఇచ్చాడు. ఇంద్రుడు దానిని ఏనుగు తలపై ఉంచాడు. ఆ పుష్ప ప్రభావం వలన ఆ ఏనుగు తల గణపతికి మనోజ్ఞమైన ముఖంగా మారింది. ఆ విధంగా గజముఖుడై, గజవక్త్రుడనే పేరును పొందాడు. ఆయనకు నమస్కారం. కాంతము అనగా మనోజ్ఞమైన లేక అందమైన అని అర్థం.

.. ఇంకా ఉంది



# శ్రీ వేంకటేశ్వర రహస్యము

శ్లో॥ శ్రీ వేంకటేశ్వరే దేవే తీర్థాని సకలాని హి ॥
విద్యంతే సర్వ దేవాశ్చ మునయః పితరస్తథా
ఏకకాలం, ద్వికాలం వా త్రికాలం సర్వదైవ వా
యే స్మరంతి మహాదేవం శ్రీనివాసం విముక్తిదమ్
కీర్తయంత్యథవా విప్రాః తే ముక్తాః పాప పంజరాత్ ॥

(స్కాం.పు.వేం.మా.అ.18.శ్లో.5,6,7)

సకలతీర్థాలు శ్రీ వేంకటేశ్వరునిలోనే ఉన్నాయి. సర్వదేవులు, మునులు, పితరులు మున్నగువారందరూ శ్రీ వేంకటేశునిలోనే ఉన్నారు. శ్రీనివాసుడు విముక్తి ప్రసాదించే దైవం. ఆయనను ఒకసారి కాని, లేక రోజునకు రెండుసార్లు, లేక మూడు సార్లు గాని స్మరించిన వారు, నిత్యం ఆ మహాదేవుని స్మరించినవారు (వారి వారి భక్తి శ్రద్ధలను బట్టి) పాప పంజరం నుండి ముక్తిని పొందుతారు. పరమభక్తులు, మిక్కిలి శ్రద్ధాసక్తులు కలవారు జీవితంలో ఒకే ఒక్కసారి ఆ స్వామిని స్మరించినా ముక్తి పొందగలుగుతారు. శంకరుడు బ్రహ్మ మున్నగు మహాత్ముల చేత కూడా పూజింపబడే శ్రీవేంకటేశ్వరుడు, సాక్షాత్తు నారాయణుడు. పరదైవం. ఆయనను స్మరించినంత మాత్రం చేత యముని భయం జీవునకు కలగదు. ఇంతెందుకు? దానాలు, వ్రతాలు, తపస్సులు, యజ్ఞాలు చేసిన వారికంటె శ్రీ శ్రీనివాసుని ఒకే ఒకసారి అర్చించినవాడు ధన్యుడు. పుణ్యుడు. సార్థకజీవి. స్వామిని స్మరింపనివాని సర్వపుణ్యకార్యాలు వ్యర్థాలు. శ్రీనివాస స్మరణ చేయనివాడు అజ్ఞాని. పాపాత్ముడు. మూగవాడు. చెవిటివాడు. జడుడు. గ్రుడ్డివాడు. శ్రీ వేంకటేశద్వేషికి ఎప్పడూ శుభాలు కలగవు. మానవజన్మ ఎన్నో జన్మల పుణ్యఫలం. అందుకే మనుష్యజన్మ దుర్లభం అన్నారు. ఈ భూలోకంలో ఉత్కృష్టమైన మానవ జన్మను పొంది కూడా శ్రీ వేంకటేశుని దర్శించక, అర్చించక జీవితాన్ని వ్యర్థం చేసుకొన్నవాడు నీచ జన్మలు ఎత్తుతాడు. వాడి మానవజన్మ వ్యర్థం. వాడు మరణించాక వాని శరీరాన్ని కుక్కలు కూడా ముట్టవు. ఘోరనరకాలపాలై కృమికీటకాల జన్మలు ఎత్తుతాడు. దేవదేవుడు అయిన శ్రీ వేంకటేశ్వరుని పూజించిన వానికి అన్యదేవతల వల్ల ప్రయోజనం ఏముంటుంది? కారణం అన్ని దేవతల రూపాలు ఆయనలో ఉండడమే. మానవజన్మ అనేక దుఃఖాలతో నిండిన, వ్యథలతో కూడిన జన్మ. వేంకటేశుని భక్తులను దర్శించినా, వేంకటేశ్వరుని భక్తులను సేవించినా, ఆయన కథలను విన్నా చాలు. మానవజీవితంలోని దుఃఖాలు పటాపంచలవుతాయి. సర్వసుఖాలు లభిస్తాయి. భక్తులను, భక్తుల బంధువులను, భక్తుల స్నేహితులను కూడా యముడు శిక్షించడు.

....ఇంకా ఉంది



# శ్రీ మత్స్యమహాపురాణం

శ్లోII ప్రియతాం భగవాన్విష్ణుర్మత్స్యరూపి జనార్ధనః I


వాచాపుష్పైః ప్రకృతయా ఉత్యల్పయా సేవ యాఽవయాII

విష్ణుస్వరూపుడైన వేదవ్యాసుడు పద్నాలుగు వేల శ్లోకాలతో మత్స్యపురాణాన్ని మనకు అందించాడు. ఐహికములు, ఆముష్మికములు అనే సర్వసుఖాలను మానవ సమాజమునకే కాక, సర్వప్రాణులను తరింపచేయుటలో శ్రుతులు, స్మృతులతో పాటుగా పురాణములకు కూడా ప్రామాణ్యము కలదు. సకల పురుషార్ధసాధనములైన పురాణములలో శ్రీ మత్స్యమహాపురాణ ప్రాశస్త్యము ఎన్నదగినది. ఈ మత్స్యమహాపురాణము నందు జ్ఞానము- భక్తి, శ్రౌత,స్మార్త,నిత్య,నైమిత్తిక,కామ్య,కర్మానుష్ఠానోపయోగములైన అనేక అంశాలు పొందుపరచబడ్డాయి. భూగోళ-యుగ-ఖగోళ వ్యవస్థలకు చెందిన అనేక అంశములు. లోక ప్రవృత్తి సాధకములైన రాజధర్మములు మొదలైనవి చక్కగా తెలుపబడ్డాయి. ఈ మత్స్యమహాపురాణము నందు ఆయా సందర్భములలో తెలుపబడిన దేవతాస్తోత్రములు తత్త్వ ప్రతిపాదకములే కాక ఉపాసనవిషయకములై ఉన్నవి. శ్రీదేవి స్థానాష్టోత్తర నామములు, శివనామ త్రిశతి, మాతృక సంఖ్యాకశివనామావళి, శివనామసప్తతి, వీరకకృత గౌరీస్తుతి, సావిత్రీకృత యమస్తుతి మొదలగునవి. పఠితలకు ఎంతో ఉపయోగకరమైనవి. ఈ పురాణం నందు ప్రతిపాదింపబడిన విషయక్రమము మానవజీవనప్రవృత్తికి ఎంతో సహాయపడుతుందనడంలో అతిశయోక్తి లేదు. 'మ' అను ఏకాక్షరశబ్దమునకు జలము అని అర్థము. ఇది 'మన్' అను ధాతువు నుండి 'న్' కారము లోపించగా నిష్పన్నమైనది. మే జలే తిష్ఠతీతి - నీటి యందు ఉండునది. మ+త్య - అనుచోట 'స' కారము ఆగమముగా వచ్చి మత్స్య అను శబ్దంమేర్పడినదని పండితులు వివరించియున్నారు. ఇక పురాణం నందు చెప్పబడిన అంశములను తెలుసుకుందాం.

## మత్స్యావతార కథనం

నైమిశారణ్యంలో దీర్ఘసత్రయాగం చేస్తున్న మునులు ఏకాంతంగా కూర్చుని ఉన్న సూతమహర్షిని సమీపించి "అనఘా! ఇప్పటివరకు మనోహరములైన కొన్ని పురాణములను వినిపించి ఉన్నారు. అవి అమృతంతో సమానంగా ఉండి ఇంకా వినాలని మాకు వేడుకగా ఉన్నది. ఎంత విన్న తృప్తి కలగడం లేదు. భగవానుడైన శ్రీమహావిష్ణువు ఏ కారణంగా మత్స్యరూపాన్ని ధరించి లోకాన్ని ఉద్ధరించారు. అలాగే పరమశివునికి భైరవుడు, పురారి, కపాలి అనబడే నామాలు కలవు కదా! వీటికి కారణం ఏమిటి? ఇదంతా విస్తరించి మాకు చెప్పమని వేడుచున్నాము. అది విని సూతమహర్షి ఇట్లు చెప్పడం మొదలుపెట్టాడు.

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః    శ్రీ మాత్రేనమః    శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 348. వంద్యా (ఓం ఐం హ్రీం శ్రీం వంద్యాయై నమః)



నమస్కరింపదగిన స్త్రీ మూర్తిని వంద్య అంటారు. సకల లోకాలలోని ప్రాణులు అమ్మవారిని నమస్కరించి తరిస్తుంటారు మొట్టమొదటి నమస్కారం అందుకొనడానికి అర్హురాలు అమ్మవారే. గోరోచన వర్ణంలో ఉండే అమ్మవారి ఒకానొకరూపం.

### మంత్ర ప్రయోగం – ఫలితం

ఈ నామ మంత్రాన్ని 27 దినాలు యధాశక్తి జపం చేసి తల్లితండ్రులకు గురువులకు అత్తమామలకు లేక పెద్దవారికి నమస్కరించిన వారు అందరి మన్నలలు పొందుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. ఉద్యోగాలలో రాణిస్తారు.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# మహర్షి అష్టావక్రుడు

ఒకనాడు అష్టావక్రుడు ఉద్దాలకుని తొడపై కూర్చొనిఉండ శ్వేతకేతువు ఆతని 'ఇది నీ తండ్రి తొడకాదు, నా తండ్రి తోడ లెమ్ము' అని లాగివైచెను. అష్టావక్రుడు ఏడ్చుచు తన తల్లి వద్దకు వెళ్ళి 'నాతండ్రి యెవ్వరు' అని ప్రశ్నించగా, సుజాత ఈ వృత్తాంతమంతటియును కుమారునకు వివరించెను. తండ్రి జనకచక్రవర్తి వద్ద పందెంలో ఓడిపోవడంతో జలమజ్జితుడై వరుణుని యజ్ఞానికి పంపించబడ్డాడు. ఈ విషయం తెలిసిన అష్టావక్రుడు తన తండ్రిని విడిపించాలనే సంకల్పంతో చిన్నవయస్సులోనే రాజధానికి వెళ్ళి జనకుని సభలో వాదానికి సిద్ధమయ్యాడు. అద్భుతమైన శాస్త్రజ్ఞానంతో వంది అనే జ్ఞానిని ఓడించి తన తండ్రిని విముక్తుడిని చేసాడుస. ఈ సంఘటన అష్టావక్రుని పరాక్రమం, పాండిత్యాన్ని సాక్షిగా చూపుతుంది. తండ్రి అష్టావక్రుని పితృభక్తికి ఎంతగానో సంతసించాడు. పాండిత్య ప్రకర్షకు గర్వపడ్డాడు. నది యందు సాన్నం చేయించి తన కుమారుని వంకరులు పోవునట్లు చేసాడు. అంత అష్టావక్రుడు సుందరుడైనాడు. ఇంటికి వచ్చి తల్లితండ్రులకు సేవ చేయుచు కాలక్షేపం చేయసాగాడు. వివాహ వయస్సు రాగానే తండ్రి కుమారునకు పెళ్ళి చేయతలపెట్టారు. తన నిర్ణయమును కుమారునకు తెలియజేసాడు. కుమారుడు అంగీకారము తెలిపి వదాన్య మహర్షి కుమార్తెయగు సుప్రభను వివాహము చేసుకొన్నాడు. భార్యను వెంటబెట్టుకొని ఆశ్రమమునకు వచ్చి తపస్సునందుండిపోయాడు. సుప్రభ అష్టావక్రుల గృహస్థాశ్రమం అద్వితీయముగా, ఆదర్శప్రాయంగా సాగింది. పుత్రులను పొందాడు. అష్టావక్రుని గతజన్మలో ఆయన దేవలమహర్షిగా జన్మించి తపస్సు చేస్తూ ఇంద్రుడిచేత పంపబడిన రంభ ద్వారా శాపము పొందాడు. అదే శాపం వలన అష్టావక్రుడుగా పునర్జన్మ పొందాడు. రంభ శాపవిమోచనం కూడా ఇచ్చి స్వర్గానికి వెళ్ళిపోయింది. అష్టావక్రుని వేదాంత జ్ఞానం అపారమైనది.

ఆయన జనకమహారాజుతో చేసిన వేదాంత చర్చే "అష్టావక్ర గీత" గా ప్రసిద్ధి పొందింది. ఇది అద్వైత వేదాంతం లోతైన అర్థాలను తెలిపే గొప్ప గ్రంథంగా ఉన్నది. ఆయన పరమాత్మలో లయం చెంది మోక్షం పొందాడు.

.ఇంకాఉంది



## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను

| ఆవరణ | గణపతి నామము | స్థలము | దర్శనము వలన కలుగు ఫలితం |
|---|---|---|---|
| ప్రథమ | అర్క వినాయకుడు | అసీ-గంగా సంగమము | ఆదివారం చూచినచో సర్వతాపములు తొలగుతాయి |
| ప్రథమ | దుర్గా వినాయకుడు | కాశీకి దక్షిణమున | దుర్గతులు తొలగిపోతాయి |
| ప్రథమ | భీమచండి వినాయకుడు | నైరుతి మూల యందు | మహాభయములు తొలగుతాయి |
| ప్రథమ | దేహళీ వినాయకుడు | పడమట దిక్కునందు | సర్వ దివిఘ్నములు తొలగుతాయి |
| ప్రథమ | ఉద్దండ వినాయకుడు | వాయువ్య దిశ యందు | విఘ్నములను శిక్షించి శుభములు కలిగించును |
| ప్రథమ | పాశపాణి వినాయకుడు | ఉత్తరదిక్కు యందు | కాశీ వాసుల విఘ్నములను పాశముతో బంధించి రక్షించును |
| ప్రథమ | ఖర్వ వినాయకుడు | వరణ-గంగ సంగమము నందు | గొప్ప గొప్ప విఘ్నములను తొలగించును |
| ప్రథమ | సిద్ధి వినాయకుడు | తూర్పు దిక్కున యమ తీర్థానికి పడమటి భాగమునందు | సాధకులకు శీఘ్రముగా సిద్ధి కలుగజేయును |



కాశీ బాహ్యము లో ఉన్న ఈ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

..ఇంకాఉంది

# శ్రీ విశ్వనాధాష్టకము

గంగా తరంగ రమణీయ జటా కలాపం గౌరీ నిరంతర విభూషిత వామ భాగం |

నారాయణ ప్రియమనంగ మదాపహారం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |1|

వాచామగోచరమనేక గుణ స్వరూపం వాగీశ విష్ణు సుర సేవిత పాద పద్మం |

వామేణ విగ్రహ వరేన కలత్రవంతం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |౽|

భూతాదిపం భుజగ భూషణ భూషితాంగం వ్యాఘ్రాంజినాం బరధరం, జటిలం, త్రినేత్రం |

పాశాంకుశాభయ వరప్రద శూలపాణిం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |3|

సీతాంశు శోభిత కిరీట విరాజమానం బాలేక్షణాతల విశోషిత పంచబాణం |

నాగాధిపా రచిత బాసుర కర్ణ పూరం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |4|

పంచాననం దురిత మత్త మతంగజానాం నాగాంతకం ధనుజ పుంగవ పన్నాగానాం |

దావానలం మరణ శోక జరాటవీనాం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |5|

తేజోమయం సగుణ నిర్గుణమద్వితీయం ఆనంద కందమపరాజిత మప్రమేయం |

నాగాత్మకం సకల నిష్కళమాత్మ రూపం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |6|

ఆశాం విహాయ పరిహృత్య పరశ్య నిందాం పాపే రథిం చ సునివార్య మనస్సమాధౌ

ఆధాయ హృత్-కమల మధ్య గతం పరేశం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |7|

రాగాధి దోష రహితం స్వజనానురాగం వైరాగ్య శాంతి నిలయం గిరిజా సహాయం

మాధుర్య ధైర్య సుభగం గరళాభిరామం వారాణసీ పురపతిం భజ విశ్వనాధమ్ |8|

వారాణసీ పుర పతే స్థవనం శివస్య వ్యాఖ్యాతమ్ అష్టకమిదం పఠతే మనుష్య

విద్యాం శ్రియం విపుల సౌఖ్యమనంత కీర్తిం సంప్రాప్య దేవ నిలయే లభతే చ మోక్షమ్ |౯|

విశ్వనాధాష్టకమిదం పుణ్యం యః పఠేః శివ సన్నిధౌ శివలోకమవాప్నోతి శివేనసహ మోదతే |10|

# గురుదేవుల జీవన కవనము

## పంచత్రిమ్శత అధ్యాయః



భూలోక మణిద్వీపమైన శ్రీ ప్రణవ పీఠం ఏలూరు మహానగరంలో స్థాపించబడింది. ఆనాటి నుండి ఈనాటి వరకు శ్రీ ప్రణవ పీఠంలో భక్తుల మనోవాంఛలు అన్నీ నెరవేరాయి. భక్తులకు శ్రీ ప్రణవ పీఠం వరములిచ్చే గోవుగా మారింది,ఆ తర్వాత శ్రీ ప్రణవ పీఠంలో శ్రీరామ చంద్ర గుడి,రమా సమేత సత్యనారాయణ స్వామి గుడి, సత్య ధర్మలింగేశ్వర గుడి ప్రతిష్ఠలు కూడా జరిగింది.అనేక దేవతా ప్రతిష్ఠలు కూడా శ్రీ ప్రణవ పీఠంలో జరిగింది. ప్రణవ పీఠం సాక్షాత్తు భూలోక వైకుంఠం, మణిదీపం, కైలాసం. ప్రణవ పీఠం స్థాపించిన తర్వాత గురువు గారు వందల సంఖ్యలో భాగవత ప్రవచనాలు చేసారు అష్టాదశ పురాణములను భక్తులకు అందించారు.లోకశ్రేయస్సుకు అనేక హోమములు చేసారు చేయించారు. శ్రీ ప్రణవ పీఠాన్ని బెంగళూరు, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి మహానగరాలకు కూడా విస్తరించారు. హైదరాబాద్ మహానగరంలో శ్రీ ప్రణవ పీఠమునకు అనుబంధముగా అత్యంత వైభవోపేతంగా గొప్ప ప్రవచన మంటపమును నిర్మిస్తున్నారు. ఈ ప్రవచన మండపం ద్వారా నిరంతరం అష్టాదశ పురాణముల ప్రవచనములు రామాయణ,భారత ప్రవచనములు ,పారాయణములు జరగాలి , లోక శ్రేయస్సు కోసం అనేక హోమములు నిర్వహించాలి అనే దివ్య సంకల్పంతో గురు గారు ఈ కార్యమునకు శంకుస్థాపన చేసారు.ప్రవచన మండపము కోసం భూమి పూజ కూడా పూర్తి అయి ఉన్నది మండప నిర్మాణం పూర్తి అయిన వెంటనే గురువు గారి సంకల్పంతో పురాణ శ్రవణమూ వేద శ్రవణము నిరంతరము జరుగు విధముగా గురువుగారు అనుగ్రహించారు.

... ఇంకా ఉంది